శ్రీ లలితాంబికాయై నమః

శ్రీ శంకర భగవత్పాద కృత

సౌందర్యలహరి

శ్లో॥ శివ శ్శక్త్యాయుక్తోయది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో నఖలు కుశలః స్పన్దితు మపి
అతస్త్వా మారాధ్యాం హరిహర విరిఞ్చాదిభిరపి
ప్రణంతుం స్తోతుంవా కథ మకృత పుణ్యః ప్రభవతి. 1

సర్వశక్తి స్వరూపిణివైన, ఓ భగవతీ! సర్వమంగళ కారుడయిన శివుడు జగన్నిర్మాణ శక్తివయిన నీ ప్రమేయం లేకపోతే కాని జగాలను సృష్టించటానికి సమర్థుడు కాడు. అలా నీ ఆ దేవుడు తాను కదలటానికి సైతం అశక్తుడు. కాబట్టి హరి హర బ్రహ్మాదుల చేతను పూజింపదగిన నిన్ను మ్రొక్కటానికిగాని, స్తుతించటానికిగాని గతజన్మలో పుణ్యం చేయని వ్యక్తి ఎలా సమర్థుడవుతాడు? కాడు.

శ్లో॥ తనీయాంసం పాంసుం తవచరణ పఙ్కేరుహ భవం
విరిఞ్చి స్సఞ్చిన్వన్ విరచయతి లోకా నవికలమ్
వహత్యేనం శౌరిః కథమపి సహస్రేణ శిరసాం
హరః సంక్షుద్యైనం భజతి భస్మోద్ధూళనవిధిమ్. 2

ఓ శివానీ! బ్రహ్మదేవుడు నీ చరణకములాలలో పుట్టిన కించిత్తు పరాగాన్ని గ్రహించి లోకాలను ఎలాటి వైకల్యం లేకుండ సృష్టిస్తాడు. ఈ యించుక పాదరేణువు వల్లనే శ్రీమహావిష్ణువుకూడ తన వేయి శిరస్సులతో ఆదిశేషుడై కష్టంతో మోస్తున్నాడు. దానినే పరమశివుడు చక్కగా మెత్తి తన శరీరంపై విభూతిగా పూసుకుంటున్నాడు.

శ్లో॥ అవిద్యానా మన్తస్తిమిర మిహిరద్వీపనగరీ
జడానాం చైతన్యస్తబక మకరన్ద స్రుతి ఝరీ
దరిద్రాణాం చిన్తామణిగుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి. 3

ఓ మాతా! నీ పాదరేణువు అజ్ఞానాంధకారాన్ని పోగొట్టే సూర్యుడు ఉదయించే ద్వీపంలోని పట్టణం వంటిది. అలాగే మందబుద్ధులైన జడులకు జ్ఞానమనే పూదేనె ప్రవాహం అవుతోంది. అలాగే నీ పాద జస్సు, దరిద్రులకు, సకలసంపదలనిచ్చే చింతామణుల శ్రేణి అవుతోంది. అంతేగాక జనన మరణ

సంసారరూపమైన సాగరంలో మునిగి దరిగానక తపించే వారికి – ఆ విష్ణువు అవతారమైన ఆదివరాహస్వామి కోర అయి ఉద్ధరిస్తోంది.

శ్లో॥ త్వదన్యః పాణిభ్యా మభయవరదో దైవతగణః
త్వమేకా నైవాసి ప్రకటిత వరాభీత్యభినయా
భయాత్త్రాతుం దాతుం ఫలమపిచ వాఞ్ఛా సమధికం
శరణ్యే లోకానాం తవహిచరణా వేవ నిపుణౌ. **4**

భవానీ! లోకరక్షకా! నీకంటె యితరులైన ఇంద్రాదులైన దేవతాగణం తమ హస్తాలలో అభయ వరముద్రలను ధరించి వున్నారు. నువ్వు మాత్రం హస్తాలచేత వెల్లడింపబడిన వరాభయముద్రలను ధరించేదానవు కానే కాదు! ఎందుకంటె, ఓ అంబా! నీ పాదాలు మాత్రమే భక్తులను భయం నుంచి రక్షించటానికి, కోరిన దానికన్నా అధిక ఫలాన్ని ఒసగటానికి సామర్థ్యం కలవి అని తెలియనవుతోంది.

శ్లో॥ హరి స్త్వామారాధ్య ప్రణత జన సౌభాగ్య జననీం
పురా నారీ భూత్వా పురరిపు మపి క్షోభమనయత్;
స్మరోఽపి త్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషా
మునీనా మప్యన్తః ప్రభవతి హి మోహాయ మహతామ్.5

ఓ శాంభవీ! భక్తజనులకు సౌభాగ్యాన్ని ప్రసాదించే నిన్ను పూర్వం శ్రీహరి ఆరాధించి మోహనాంగియై త్రిపురాలను తెగటార్చి క్రోధావిష్టుడైన శివుడికి మనస్సులో కామవికారాన్ని కలిగించి క్షోభపెట్టాడు. అలాగే మన్మథుడు నిన్ను కొలిచి తన సతి రతీదేవి కన్నులకు చూరగొనదగ్గ సౌందర్యంగల శరీరంగలవాడై, అలాటి రూపుతో అరణ్యాలలో తపస్సు చేసుకొనే మునుల మనస్సులలో కామాభిలాష కలిగించటానికి సమర్థుడైనాడు. ఆహా! నీ ప్రసాద మహత్తు అద్భుతం కదా!

శ్లో॥ ధనుఃపౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచవిశిఖాః
వసన్త స్సామన్తో మలయమరు దాయోధన రథః
తథాఽప్యేకస్సర్వం హిమగిరిసుతే కామపి కృపామ్
అపాఙ్గాత్తే లబ్ధ్వా జగదిద మనఙ్గో విజయతే. **6**

ఓ కళ్యాణీ ! మన్మథుడి ధనుస్సు పువ్వులతో రూపొందించబడినది; అల్లెత్రాడు తుమ్మెదలు చేరినది, బాణాలు ఐదు మాత్రము, ఆతడి చెలికాడు జడుడైన వసంతుడు. మలయమారుతం అతని యుద్ధరథం: ఇలా అసమర్థాలైన పరికరాలు కలిగిన మన్మథుడు అనంగుడు, బలిష్ఠమైన మేనులేని

వాడైవుండీ నిన్నారాధించి నీ కడకంటి కటాక్షంతో చెప్పనలవికాని నీ దయను పొంది యీ జగత్తు నంతటినీ జయిస్తున్నాడు.

శ్లో॥ క్వణత్కాఞ్చీదామా కరికలభ కుంభస్తననతా
పరిక్షీణామధ్యే పరిణత శరచ్చంద్రవదనా
ధనుర్బాణాన్ పాశం సృణి మపి దధానా కరతలైః
పురస్తా దాస్తాం నః పురమథితు రాహో పురుషికా. 7

మ్రోగుచున్న మణుల, బంగారు మొలనూలు కలదీ, గున్న ఏనుగు కుంభస్థలాలతో సాటివచ్చే కుచముల బరువు కాస్త ముందుకు వంగినదీ, సన్నని నడుము కలదీ, శరత్కాల పూర్ణచంద్రుడివంటి మొహము కలదీ, చెరకు వింటిని పుష్పబాణాలను పాశాన్ని అంకుశాన్ని ధరించినదీ,త్రిపురాలను మట్టిపెట్టిన శివుడి అహంకార స్వరూప ఐన భగవతీదేవి మా ఎదుట సుఖాసీనయై ప్రత్యక్షమువుగాక!

శ్లో॥ సుధాసిన్ధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చిన్తామణిగృహే
శివాకారే మఞ్చే పరమశివపర్యఙ్కనిలయామ్.
భజన్తి త్వాం ధన్యాః కతిచన చిదానన్దలహరీమ్. 8

ఓ జగన్మాతా! అమృతసముద్రం నడుమ నెలకొన్న రత్నాల దీవిలో కల్ప వృక్షాల వరుసతో చుట్టబడినదైన కదంబచెట్ల పూతోటలలో చెలువొందే చింతామణులతో నిర్మితమైన గృహంలో, శక్తిరూపమైన (త్రికోణపు) మంచములో, శివ పర్యంక నిలయపై నిరతిశయానంద ప్రవాహ రూపమైన నిన్ను కొందరు ధన్యులు మాత్రం సేవిస్తున్నారు. (అందరికీ సామాన్యంగా నీ సేవ లభించదని భావం.)

శ్లో॥ మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశ ముపరి
మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్త్వా కులపథం
సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసే. 9

ఓ పరాశక్తీ ! నువ్వు మూలాధారం చక్రంలో భూతత్త్వమును, మణిపూర చక్రంలో వున్న ఉదకతత్త్వాన్ని, స్వాధిష్ఠాన చక్రంలోని అగ్నితత్త్వాన్ని, అనాహత చక్రంలోని వాయుతత్త్వాన్ని, అంతకు పైనవుండే విశుద్ధచక్రంలోని ఆకాశ తత్త్వాన్ని, కనుబొమల నడుమనుండే ఆజ్ఞాచక్రంలోని మనస్తత్త్వాన్ని

వీడి, సుషుమ్నా మార్గాన్ని ఛేదించుకొని సహస్రార కమలంలోని నీ భర్త ఐన సదాశివుడితో కూడి రహస్యంగా క్రీడిస్తున్నావు.

శ్లో॥ సుధాధారాసారై శ్చరణ యుగళాన్తర్విగళితైః
ప్రపఞ్చం సిఞ్చన్తీ పునరపి రసామ్నాయ మహసః,
అవాప్య స్వాంభూమిం భుజగనిభమధ్యుష్టవలయం
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుణ్డే కుహరిణి. 10

ఓంకారరూపిణీ ! నీ పాదపద్మాల రెంటి మధ్యప్రదేశంనుంచి స్రవించే అమృత ధారలచేత ప్రపంచాన్ని తడుపుతూ అమృత కాంతిచే వెలుగొందే చంద్రుణ్ణి వీడి స్వస్థానమైన ఆధారచక్రాన్ని మరల ప్రాపించి, దాన్లో స్వస్వరూపాన్ని సర్పం మాదిరి కుండలాకారంగా గావించి తామర దుద్దు నడుమన సన్నని రంధ్రంవలె ఎంతో సూక్ష్మమైన పృథివీతత్త్వంలో కుండలినీ శక్తిపై నిద్రిస్తావు.

శ్లో॥ చతుర్భి శ్శ్రీకణ్ఠై శ్శివయువతిభిః పఞ్చభిరపి
ప్రభిన్నాభి శ్శమ్భోర్నవభిరపి మూలప్రకృతిభిః
చతుశ్చత్వారింశ ద్వసుదళ కలాశ్రత్రివలయ
త్రిరేఖాభి స్సార్థం తవ శరణకోణాః పరిణతాః. 11

అమ్మా శ్రీదేవీ ! నలుగురు శివులతోను, శివుడికంటె వేరైన ఐదుగురు శివ శక్తులతోను, తొమ్మిది మూలప్రకృతులతోను, అష్టదళం, షోడశదళం, మేఖలాత్రయం, భూపురం అనే వాటితోను కూడి నీకు నివాసస్థానమైన శ్రీచక్రం యొక్క కోణాలు నలభై నాలుగు సంఖ్య గలవిగా పరిణమించి వున్నవి. (నాలుగు శివచక్రాలతోను, ఐదు శక్తి చక్రాలతోను కూడి తొమ్మిది చక్రాలతో సొంపారు తోందని భావం)

శ్లో॥ త్వదీయం సౌన్దర్యం తుహినగిరికన్యే తులయితుం
కవీన్ద్రాః కల్పంతే కథమపి విరిఞ్చి ప్రభృతయః
యదాలోకౌత్సుక్యా దమర లలనాయాన్తి మనసా
తపోభి ర్దుష్ప్రాపామపి గిరిశ సాయుజ్య పదవీమ్. 12

ఓ హైమవతీ! నీ లావణ్యాన్ని, సౌందర్యాన్ని సరిపోల్చి వర్ణించటానికి బ్రహ్మ కవివరేణ్యులు ఎంత ప్రయత్నించీ సమర్థులు కాకున్నారు. నిన్ను ఎలానూ వర్ణించలేకున్నారు. (ఊర్వశి, తిలోత్తమ మొదలైన అప్సరసలు) అలాటి లోకోత్తర నీ సౌందర్యాన్ని విచూడ కుతూహలం గలవారై ఆ నీ అందంతో తాము

కించిత్తూ సరిరాక పోయినవారై, తపస్సులచేత కూడ పొందరానిదైన పరమశివుడితోడి సాయుజ్య స్థానాన్ని మనస్సుచేత పొంద యిష్టపడుతున్నారు.

శ్లో॥ నరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాఙ్గాలోకే పతిత మనుధావన్తి శతశః
గలద్వేణీబంధాః కుచకలశ విస్రస్త సిచయాః
హఠాత్రుట్యత్కాంచ్యో విగళిత దుకూలా యువతయః.**13**

ఓ భవానీ ! నీ కడకంటి చూపుకు పాత్రమైనవాడు ఎంత ముదుసలి ఐనా, వికారరూపుడైనా,విరసుడైనా వందలాది యువతులు అతగాడినే వలచి, మోహిస్తారు.

శ్లో॥ క్షితౌ షట్పఞ్చాశ ద్ద్విసమధిక పంచాశదుదకే
హుతాశే ద్వాషష్టి శ్చతురధిక పంచాశ దనిలే
దివి ద్విష్షట్త్రింశ న్మనసి చ చతుష్షష్టి రితి యే
మయూఖాస్తేషా మప్యుపరి తవపాదంబుజ యుగమ్.**14**

ఓ శంకరీ ! భూతత్త్వమందు ఏభై ఆరు, జలతత్త్వంలో ఏభైరెండు, అనిలునిలో అరవైరెండు, వాయువులో ఏభైనాలుగు, దివిలో డభైరెండు, మనస్సులో అరవై నాలుగు సంఖ్యగలవై నీ చరణ కిరణాలు వెలుగొందుచున్నవి. ఆ ఆరింటికి పైన సహస్రదళకముల మధ్యంలో వర్తించే చంద్రబింబాత్మకమై బైందవ స్థానమనే పేరు గల అమృత జలధితో నీ పాదపద్మయుగం ప్రకాశిస్తోంది.

శ్లో॥ శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత జటాజూట మకుటాం
వరత్రాసత్రాణ స్ఫటిక ఘటిక పుస్తక కరామ్
సకృన్నత్వా నత్వా కథమివ సతాం సన్నిదధతే
మధుక్షీర ద్రాక్షా మధురిమ ధురీణాః ఫణితయః **15**

మాతా! శరత్కాల చంద్రికవలె శుద్ధమైనదానవూ, నెలవంకతోకూడిన జటాజూటమే కిరీటముగా గలదానవూ, వరాభయముద్రలు, అక్షమాలా పుస్తకాలను ధరించినదానవూ ఐన నిన్ను ఒక్కసారైనా నమస్కరించిన కవీశ్వరులకు పూదేనియతో, గోక్షీరంతో, ద్రాక్షాఫలాలతో సాటివచ్చే మాధుర్యాన్ని వహించిన మధురవాక్కులు ఎలా ప్రాపించకుండా వుంటవి ? (అలాటి వాక్కులు ప్రాప్తించునని భావం)

శ్లో॥ కవీన్ద్రాణాం చేతః కమలవన బాలాతప రుచిం
భజన్తే యేసంతః కతిచి దరుణామేవ భవతీమ్
విరిఞ్చి ప్రేయస్యా స్తరుణ తరశృఙ్గారలహరీ
గభీరాభిర్వాగ్భి ర్విదధతి సతాం రఞ్జనమమీ. 16

శాంభవీ ! పద్మాలకు బాలసూర్యుని లేత ఎండ మాదిరి కవుల మనోపద్మాలకు వికాసాన్ని కలిగించే అరుణమయిన నిన్ను ఏ సత్పురుషులు సేవిస్తారో వారు శారదా ప్రసాద లబ్ధమైన శృంగారరస గంభీరాలైన సుభాషితాలచేత సభాసదులైన సుజనులకు హృదయరంజనం గావిస్తున్నారు.

శ్లో॥ సావిత్రీభిర్వాచాం శశిమణి శిలాభఙ్గరుచిభిః
వశిన్యాద్యాభిస్త్వాం సహజనని సఞ్చిన్తయతి యః
స కర్తా కావ్యానాం భవతి మహతాం భఙ్గిరుచిభిః
వచోభిర్వాగ్దేవీ వదన కమలామోద మధురైః. 17

ఈశ్వరీ ! వాక్కుల నొసగునట్టియు , చంద్రకాంత మణుల శకలాల వలె ముఖకాంతి గలగినట్టి ఐన వశిన్యాది శక్తులచే సేవించ బడుతున్న నిన్ను ఎవరు చక్కగా ధ్యానిస్తాడో అతడు కాళిదాసు మొదలైన కవుల యొక్క కవిత్వ రచన మాదిరి రుచిమంతాలై సరస్వతీదేవి యొక్క ముఖ కముల పరిమళాలను వెదజల్లే మృదువైన వాగ్గుంభనలతో సమర్థుడై కవితల్లజు డవుతున్నాడు.

శ్లో॥ తనుచ్ఛాయాభిస్తే తరుణ తరణీ శ్రీ సరణిభిః
దివం సర్వాముర్వీ మరుణిమ నిమగ్నాం స్మరతి యః
భవన్త్యస్య త్రస్యద్వనహరిణ శాలీన నయనాః
సహోర్వశ్యా వశ్యాః కతికతి న గీర్వాణ గణికాః. 18

అమ్మా, భగవతీ! బాలసూర్యుని కాంతిని బోలిన నీ మేని కెంజాయలచే భూమ్యాకాశాలు కెంపు జిగుల మున్నీటిలో మునిగిన వానినిగా ఎవడు స్మరిస్తాడో అతడికి మిగుల బెదరిన లేడికన్నుల అప్సరస కన్యలు ఊర్వశి లోనగు వారెందరెందరు వశ్యులు కారు ? అందరూ వశులవుతారు.

శ్లో॥ ముఖం బిన్దుం కృత్వా కుచయుగ మధస్తస్యతదధో
హరార్ధం ధ్యాయేద్యో హరమహిషి తే మన్మథ కలామ్
ససద్య స్సంక్షోభం నయతి వనితా ఇత్యతి లఘు

త్రిలోకీ మప్యాసు భ్రమయతి రవీన్దుస్తన యుగామ్.19

ఓ శర్వాణి ! నీ ముఖమును బిందువుగా చేసి, దాని క్రింద కలచయుగము నుంచి, దాని క్రింద త్రికోణముంచి నీ మన్మథకల నెవడు ధ్యానిస్తాడో అతడు మరుక్షణానే వనితలను సంక్షోభితలను చేస్తున్నాడనటం మాత్రమే కాదు. ఈ ముల్లోకాలనే భ్రాంతినొంద మోహ కలగియున్నాడు.

శ్లో॥ కిరన్తీ మఙ్గేభ్యః కిరణ నికురుమ్బామృతరసం
హృది త్వా మాధత్తే హిమకర శిలామూర్తి మివ యః
స సర్పాణాం దర్పం శమయతి శకున్తాధిప ఇవ
జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధార సిరయా.20

ఓ శ్రీకరీ ! సర్వావయవాలనుంచి చిమ్ముచున్న కాంతిసుధను ఏ సాధకుడు చంద్రకాంతమణి నిర్మిత దేహం గల ప్రతిమ వలె హృదయంలో ప్రతిష్ఠించి ధ్యానిస్తున్నాడో అతడు గరుత్మంతుడిలా సర్పాల దర్పాన్ని శమింపచేస్తున్నాడు. జ్వర తీవ్రతచేత ఎంతో తాపం చెందే రోగులను అమృత నాడి ఐన తన చల్లని చూపుచేత జ్వరబాధను తొలగించి సుఖాన్ని, హాయిని కలిగిస్తున్నాడు.

శ్లో॥ తటిల్లేఖా తన్వీం తపనశశి వైశ్వానరమయీం
నిషణ్ణాం షణ్ణామప్యుపరి కమలానాం తవ కలామ్
మహాపద్మాటవ్యాం మృదితమలమాయేన మనసా
మహాన్తః పశ్యంతో దధతి పరమాహ్లాదలహరీమ్. 21

ఓ సర్వమంగళా! మెరపుతీగవలె సూక్ష్మమై సుదీర్ఘమై సూర్యచంద్రాగ్ని రూపమై, క్షణప్రభమైనదీ, షట్చక్రాలకు పైన సహస్రారంలో మహాపద్మాటవిలో కూర్చున్న నీ సాదాఖ్య అనే బైందవీ కళను మహాత్ములు, పరిపక్వచిత్తులు పరమా ఆనంద లహరిగా ధరిస్తున్నారు. అంటె నిరతిశయానందాన్ని ఎల్లప్పుడు పొందుతున్నారని భావం.

శ్లో॥ భవాని త్వం దాసే మయి వితర దృష్టిం సకరుణాం
ఇతి స్తోతుం వాంఛ్ఛ కథయతి భవాని త్వమితియః
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్యపదవీం
ముకుంద బ్రహ్మేంద్ర స్ఫుట మకుట నీరాజిత పదామ్.22

తల్లీ ఓ శాంకరీ ! నీ దాసుడనైన నా యందు దయాదృష్టి చూపుము, అని ఉపాసకుడు ప్రార్థించబోయి సగం పలుకులు చెప్పబోయేటంతలో ఆతడికి ముకుంద బ్రహేంద్రుల రత్నకిరీటాలచేత నీరాజనం గావించబడే నీ పాదపద్మాలు గలదైన నీ సాయుజ్యస్థానాన్ని అతడికి ఇస్తున్నావు.

శ్లో॥ త్వయా హృత్వా వామం వపు రపరితృప్తేన మనసా
శరీరార్థం శంభో రపరమపి శఙ్కే హృతమభూత్,
యదేత త్త్వద్రూపం సకల మరుణాభన్త్రిత్రి నయనం
కుచాభ్యా మానమ్రం కుటిల శశి చూడాల మకుటమ్. 23

ఓ లోకమాతా ! నీవు శివుని శరీర వామభాగాన్ని గ్రహించి తనివితీరని మనస్సుతో తక్కిన సగంకూడ గ్రహించావని నేను తలచుచున్నాను. ఎందుకంటె నీ శరీరమంతా ఉదయకాలంలోని బాలభానుడి కాంతితో సాటివచ్చేకెంపు కాంతులతో ఒప్పారుతూ, త్రినేత్రములు , పాలిండ్ల జంటచే యించుక ముందుకు వంగినట్లు కనబడుతూ, వంపుతిరిగిన చంద్రకళను శిరోమణిగా గల కిరీటంతో విరాజిల్లుతూన్నావు.

శ్లో॥ జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వ న్నేతత్స్వమపి వపురీశ స్తిరయతి
సదాపూర్వ స్సర్వం తదిద మనుగృహ్ణాతి చ శివః
తవాజ్ఞా మాలంబ్య క్షణచలితయోర్భ్రూ లతికయోః. 24

అమ్మా! బ్రహ్మ యీ విశ్వాన్ని సృష్టిస్తూన్నాడు. మహావిష్ణువు రక్షిస్తున్నాడు. రుద్రుడు విశ్వాన్ని లయింప చేస్తూన్నాడు. పరమేశ్వరుడు యీ బ్రహ్మవిష్ణురుద్రులను తనలో లీనం చేసుకొని మహేశ్వరతత్త్వంలో అంతర్భూతం చేస్తూన్నాడు. ఇలా యీ బ్రహ్మాండం లయమయిపోతోంది. సదాశివుడు యిదంతా క్షణవికాసంగల నీ కనుబొమల ఆజ్ఞను పొంది యీ నాలుగు తత్త్వాలను అనుగ్రహించి వారితో మళ్లా యథావిధిగా యీ బ్రహ్మాండ సృష్ట్యాది కార్యాలు జరిపిస్తూన్నాడు. ఇదంతా నీ కనుబొమల కదలిక చేతనే కలుగుతున్నదని భావం.

శ్లో॥ త్రయాణాం దేవానాం త్రిగుణ జనితానాం తవశివే
భవేత్పూజా పూజా తవ చరణయో ర్యా విరచితా
తథాహి త్వత్పాదోద్వహన మణి పీఠస్య నికటే
స్థితా హ్యేతే శశ్వ న్ముకుళిత కరోత్తంసమకుటాః. 25

ఓ మహారాజ్ఞీ ! నీ పాదారవిందములకు గావించే పూజే నీ త్రిగుణాలవల్ల జనించినవారైన త్రిమూర్తులకు చేసే పూజ. వేరైనది పూజ కాబోదు. ఎందుకంటె నీ పాదాలను సదా వహిస్తూన్న నవరత్న ఖచిత పీఠానికి సమీపంలో నీ కనకరత్న సింహాసనం చెంత చేరి హస్తాలు మోడ్చి, తమ శిరములందలి రత్నకిరీటాలలో జోడించి మొక్కుతూ యీ త్రిమూర్తులు సదా నీ ఆజ్ఞను వర్తించుచున్నారు కదా!

శ్లో॥ విరిఞ్చిః పఞ్చత్వం వ్రజతి, హరి రాప్నోతి విరతిం,
వినాశం కీనాశో భజతి, ధనదో యాతి నిధనమ్
వితంద్రీ మాహేంద్రీ వితతిరపి సమ్మీలితదృశా
మహాసంహారేఽస్మిన్ విహరతి సతి త్వత్పతిరసౌ. **26**

అమ్మా ! భైరవి! మహాప్రళయం సంభవించిన సమయంలో బ్రహ్మపంచత్వం (మృతి) పొందుతున్నాడు. మహావిష్ణువు విశ్రాంతి పొందుతున్నాడు. యముడు నాశమవుతున్నాడు. కుబేరుడు కాలధర్మం పొందుతున్నాడు. ఇంద్రాది దేవతలు కన్నుమూస్తున్నారు. కాని ఓ పతివ్రతా ! ~~ఈ~~ సహస్రదళ కమలంలో కన్పట్టుతూ నీ భర్త సదాశివుడు విశృంఖలుడై స్వేచ్ఛగా విహరిస్తున్నాడు.

శ్లో॥ జపో జల్ప శ్శిల్పం సకలమపి ముద్రావిరచనా
గతిః ప్రాదక్షిణ్య క్రమణ మశనాద్యాహుతి విధిః
ప్రణామ స్సంవేశ స్సుఖమఖిల మాత్మార్పణ దృశా
సపర్యా పర్యాయ స్తవభవతు యన్మే విలసితమ్॥ **27**

విశ్వమాతా ! ఆత్మార్పణ దృష్టితో నేను చేసే వాక్ సల్లాపం నీ మంత్ర జపంగాను, నా హస్తవిన్యాసమంతా ముద్రారచనగాను, నా స్వేచ్ఛాగమనం నీకు గావించే ప్రదక్షిణగాను, నా భోజనాదులు ఆహుతిగాను, నా పరుండటం ప్రణామంగాను, సుఖకరమైన నే గావించే చేష్టావిలాసమంతా నీకు సమగ్రమై సంతోషదాయకమైన పూజగాను అవుగాక!(అలా అయ్యేట్లు నువ్వు నన్ను కరుణించు తల్లీ అని భావం.)

శ్లో॥ సుధా మప్యాస్వాద్య ప్రతిభయ జరామృత్యు హరిణీం
విపద్యన్తే విశ్వే విధి శత మఖాద్యా దివిషదః
కరాళం యత్క్ష్వేళం కబలితవతః కాలకలనా

న శమ్భో స్తన్మూలం తవ జనని తాటఙ్కమహిమా.   28

తల్లీ! సకల దేవతలూ భయంకరమైన బ్రహ్మేంద్రాది వార్ధక్యము, మృత్యువు లను హరించే అమృతాన్ని గ్రోలీ ప్రళయకాలంలో మరణిస్తూన్నారు. అతిభయంకరమై లోకాలను దహించే కాలకూటమనే మహావిషాన్ని భక్షించిన నీ పతి శంభుడికి మరణం సంభవించలేదు. ఇందుకు ముఖ్యకారణం నీచెవికమ్మల (రత్నాల కమ్మల) ప్రభావమే కదా!

శ్లో॥ కిరీటం వైరిఞ్చం పరిహర, పురః కైటభ భిదః
కఠోరే కోటీరే స్థలసి జహి జమ్భారి మకుటమ్
ప్రణమ్రేష్వేతేషు ప్రసభముపయాతస్య భవనం
భవస్యాభ్యుత్థానే తవ పరిజనోక్తి ర్విజయతే.   29

ఓమహేశీ ! ఈ బ్రహ్మ విష్ణువు ఇంద్రులు నీపాదాలకు నమస్కరించే సమయంలో నీ భవనాన్ని ప్రవేశించిన సదాశివుణ్ణి ఎదురుకొనటానికి నువ్వు అతిశీఘ్రంగా లేచి వెళ్లేటప్పుడు నీ పరిజనులైన స్త్రీలు, అమ్మా! నీ ముందు బ్రహ్మదేవుడి కిరీటం వుంది. దానికి దూరంగా నడువు; ఓ తల్లీ! ఇది కైటభాసురుణ్ణి సంహరించిన విష్ణువు కిరీటం, తొట్రుపడబోకు; అమ్మా! ఇది ఇంద్రుడి కిరీటం, దీని అగ్రభాగం తాకి జారుతావేమో జాగ్రత్తగా రమ్ము, అనే మాటలు సర్వోత్కర్షతో రాజిల్లుతూన్నవి.

శ్లో॥ స్వదేహో ద్భూతాభి ర్ఘృణిభి రణిమాద్యాభిరభితః
నిషేవ్యే నిత్యే త్వామహమితి సదా భావయతి యః
కిమాశ్చర్యం తస్య త్రినయన సమృద్ధిం తృణయతః
మహాసంవర్తాగ్ని ర్విరచయతి నీరాజనవిధిమ్.   30

ఓ శాశ్వతీ! నీ దేహం నుంచి జనించిన కాంతులచేనైన అణిమాది అష్టసిద్ధులతో అంతటా ఆవరించబడిన నిన్ను నేనని (నువ్వే నేనని) ఏ సాధకుడు ధ్యానిస్తూన్నాడో త్రినయనుడని పేరుగల సదాశివుడి నిండు ఐశ్వర్యాన్ని తృణీకరించే ఆ సాధకుడికి మహాప్రళయ కాలంలో జ్వలించిన అగ్ని నీరాజనం గావించుతోంది.

(శ్రీదేవితో తాదాత్మ్యం పొందిన సాధకుడు శ్రీదేవియే. ఆమెకు ప్రళయాగ్ని నీరాజనం.)

శ్లో॥ చతుష్షష్ట్యా తన్త్రైః సకల మతిసన్ధాయ భువనం
స్థిత స్తత్త త్సిద్ధి ప్రసవపరతన్త్రైః పశుపతిః

పునస్త్వన్నిర్బన్ధా దఖిల పురుషార్థైక ఘటనా
స్వతన్త్రం తే తన్త్రం క్షితితల మవాతీతరదిదమ్. 31

ఓ చారురూపా! పశుపతి అరపై నాలుగు విధాలైన మహామాయా శంబరాది తంత్రాలను యీ భూమండలంలో ప్రవేశపెట్టాడు. సకలసిద్ధి ప్రదాయ కమూ, ఐహిక ఫల ప్రదాయికాలూ ఐన యీ తంత్రాలద్వారా సమస్త ప్రపంచాన్ని మోహింపచేసి మిన్నకున్నాడు. మళ్లా నీ నిర్బంధంతో ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాల నొసగే నీ తంత్రాన్ని, శ్రీవిద్యా తంత్రాన్ని యీ లోకానికి ప్రసాదించాడు.

శ్లో॥ శివ శ్శక్తి కామః క్షితి రథ రవి శ్శీతకిరణః
స్మరో హంస శ్శక్ర స్తదనుచ పరా మార హరయః
అమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితాః
భజన్తే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్. 32

ఓ పరమేశ్వరీ ! శంకరుడు, శక్తి, మన్మథుడు, భూమి; అంతేగాక రవి, శీతకిరణుడు, స్మరుడు, హంసుడు, శుక్రుడు; తరువాత పర, మార, హరుడు అనేవారి సంకేతాలైన వర్ణాలు మూడు హృల్లేఖల చివరలో చేరగా ఆ వర్ణాలు ఓ మాతా! నీ నామావయవము లవుతున్నవి (నీ మంత్ర మవుతున్నవి). మంత్రం: క ఏ ఈ ల హ్రీం, హ స క హ ల హ్రీం, సకల హ్రీం అని. ఇదే పంచదశ మంత్రం లేక పంచదశాక్షరి మంత్ర మవుతోందని తెలియాలి.

శ్లో॥ స్మరం యోనిం లక్ష్మీం త్రితయ మిద మాదౌ తవమనోః
నిధా యైకే నిత్యే నిరవధి మహాభోగరసికాః
భజన్తి త్వాం చిన్తామణి గుణ నిబద్ధాక్షవలయాః
శివాగ్నౌ జుహ్వన్త స్సురభి ఘృతధారాహుతి శతైః. 33

అమ్మా! ఓ నిత్యస్వరూపిణీ! నీ మంత్రానికి ముందు కామరాజబీజం భువనేశ్వరీ బీజం, లక్ష్మీబీజం (యీ మూటిని ఐం హ్రీం శ్రీం) కలిపి నిరవధిక మహాభోగ రసికులు చింతామణులనే రత్నాలలో కూర్పబడిన అక్షరమాలలను చేతుల్లో ధరించినవారై శివాగ్నిలో కామధేనువుయొక్క నేతి ధారలతో అనేక ఆహుతులచేత హోమం చేస్తూ నిన్ను సేవిస్తూన్నారు.

శ్లో॥ శరీరం త్వం శమ్భో శ్శశిమిహిర వక్షోరుహయుగం

తవాత్మానం మన్యే భగవతి నవాత్మాన మనఘమ్
అతశ్శేష శ్శేషీ త్వయ ముభయసాధారణతయా
స్థితస్సమ్బన్ధోవాం సమరస పరానన్ద పరయోః. **34**

ఓ భగవతీ! నీవు, శివునకు సూర్య చంద్రులు స్తనయుగంగాగల శివునకు శరీర మవుతున్నావు. అమ్మా! నీశరీరాన్ని దోషరహితమైన నవ వ్యూహాత్మకమైన ఆనందభైరవునిగా తలచుతాను. ఇందువల్ల మీ యిరువురకు (శివశక్తులకు) సమరస పరమానంద రూపులగు శేషశేషిత్వ సంబంధము నిత్యమైనది.

శ్లో॥ మనస్త్వం వ్యోమ స్త్వం మరుదసి మరుత్సారథి రసి
త్వ మాప స్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహిపరం,
త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా
చిదానన్దాకారం శివయువతి! భావేన బిభృషే. **35**

ఓ ఈశ్వరీ ! నీవే మనస్సు , ఆకాశం, మరుత్తు , అగ్ని, జలం, భూమి అయి ఉన్నావు. నీకంటె యితరం ఏదీ లేదు. నువ్వే నీ స్వరూపాన్ని ప్రపంచరూపంగా పరిణమింప చేయుటానికి చిదానందాకారాన్ని (చిచ్ఛక్తి ఆనందభైరవుల ఆకారం)ధరిస్తున్నావు.

శ్లో॥ తవాజ్ఞాచక్రస్థం తపన శశికోటిద్యుతిధరం
పరం శమ్భుం వన్దే పరిమిళితపార్శ్వం పరచితా,
యమారాధ్య న్భక్త్యా రవిశశిశుచీనా మవిషయే
నిరాలోకేఽలోకే నివసతిహి భాలోకభువనే. **36**

నీ ఆజ్ఞాచక్రంలో వెలుగొందే రవిచంద్రకోటి కాంతిని ధరించిన వాడూ, పర అనే చిత్తు చేత ఆవరించబడిన పార్శ్వాలు గలవాడూ ఐన పరమశంభుని నమస్కరిస్తున్నాడు. ఈయన్ను పరమభక్తితో ఆరాధించే భక్తుడు సూర్యచంద్రా దులకు అగోచరమై చూడశక్యంకానిదీ, విజనమూ ఐన జ్యోతిర్లోకంలో నివసిస్తాడు.

శ్లో॥ విశుద్ధౌ తే శుద్ధస్ఫటికవిశదం వ్యోమజనకం
శివం సేవే దేవీమపి శివసమానవ్యవసితామ్
యయోః కాన్త్యా యాన్త్యా శ్శశికిరణసారూప్యసరణే
ర్విధూతా న్తర్ధ్వాన్తా విలసతి చకోరీవ జగతీ. **37**

అమ్మా! ఏ యిద్దరివల్ల వచ్చే చంద్రకిరణ సారూప్య సరణి ఐన కాంతి వల్ల జగత్తు అజ్ఞానమనే చీకటి నుంచి దూరమై చకోరపక్షి మాదిరి విలసిల్లుతూందో అలాటి నీ విశుద్ధ చక్రంలో శుద్ధస్ఫటిక నిర్మలుడై వ్యోమ జనకుడైన శివుణ్ణి, ఆతడితో సమానమైన ప్రయత్నంగల దేవి ఐన నిన్ను ఉపాసిస్తున్నాను.

శ్లో॥ సమున్మీల త్సంవి త్కమలమకరన్దై కరసికం
భజే హంసద్వన్ద్వం కిమపి మహతాం మానసచరమ్,
యదాలాపా దష్టాదశగుణిత విద్యాపరిణతిః
యదాధత్తే దోషా ద్గుణ మఖిల మద్భ్యః పయఇవ. **38**

జననీ! ఏ హంసలజతల (శివశక్తి) యొక్క ఆలాపం అష్టాదశ విద్యలుగా పరిణమించినదో, ఏది నీటినుంచి పాల మాదిరి దోషంనుంచి సద్గుణ సముదాయాన్ని గ్రహిస్తోందో, వికసించిన అనాహత కమలంలోని మకరందాన్ని గ్రోలటంలో ఆసక్తి కలిగినదీ, యోగీశ్వరుల మనస్సు అనే మానససరస్సులో సంచరించేదీ, అనిర్వాచ్యమూ ఐన ఆ హంస మిథునాన్ని భజిస్తున్నాను.

శ్లో॥ తవ స్వాధిష్ఠానే హుతవహమధిష్ఠాయ నిరతం
తమీడే సంవర్తం జనని మహతీం తాంచ సమయామ్
యదాలోకే లోకా౯ దహతి మహతి క్రోధకలితే
దయార్ద్రా యా దృష్టి శ్శిశిరముపచారం రచయతి.**39**

ఓ శాంభవీ ! నీ స్వాధిష్ఠాన చక్రంలో సంవర్త మనే అగ్నితత్త్వాన్ని ఆశ్రయించి ఎల్లప్పుడూ ఆ ప్రళయాగ్నిని స్తోత్రం చేస్తాను. మహచ్ఛబ్దంతో చెప్పబడే ప్రళయాగ్ని రూపమైన సమయను స్తుతిస్తాను. కోపంతో కూడిన ప్రళయాగ్ని రుద్రుడి చూపు భూలోకం మొదలైన వాటిని దహిస్తూంటె దయార్ద్ర దృష్టి ఐన నీ కృపాదృష్టి శైత్యోపచారం చేస్తోంది.

శ్లో॥ తటిత్త్వన్తం శక్త్యా తిమిరపరిపన్థి స్ఫురణయా
స్ఫురన్నానారత్నాభరణ పరిణద్ధేన్ద్రధనుషమ్,
తవ శ్యామం మేఘం కమపి మణిపూరైకశరణం
నిషేవే వర్షన్తం హరమిహిరతప్తం త్రిభువనమ్. **40**

జగన్మాతా ! ఓ భగవతీ! మణిపూరచక్రమే ప్రధానస్థానంగా గలదై చీకటిని నిరసించే తేజస్సుగల శక్తిచేత, మెరపు తీగలతో కూడినదీ, అనేక రత్నాలచేత నిర్మించబడిన ఆభరణాల కాంతిచే ఇంద్రధనుస్సుతో కూడినదీ ఐన, అనిర్వచనీయమైన నీ సంబంధిత కారుమేఘం ప్రళయకాల రుద్రుడనే సూర్యుడిచే తపింపచేయబడిన యీ ముల్లోకాలను వర్షధారలచే తడుపుతోంది. అలాటి శివశక్త్యాత్మకమైన నీలిమేఘాన్ని సేవిస్తాను.

శ్లో॥ తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరస మహాతాణ్డవనటమ్,
ఉభాభ్యామేతాభ్యా ముదయవిధి ముద్దిశ్య దయయా
సనాథాభ్యాం జజ్ఞే జనకజననీమ జ్జగ దిదమ్. **41**

ఓ హైమవతీ ! నీ మూలాధారచక్రంలో లాస్యరూపమైన నృత్యంపట్ల ఎంతో ఆసక్తిగల సమయ అనే పేరుగల ఆనందభైరవితో కూడ నవరసభరితమైన తాండవం చేసే నటుని నవాత్ముడిగా, తొమ్మిది రూపాలున్న ఆనందభైరవుడిగా తలచుతున్నాను. ఉత్పత్తి విధి నుద్దేశించి దయతో కూడుకొన్న యీ యిరువురిచే యీ జగత్తు జననీ జనకులు గలదైనది.

శ్లో॥ గతైర్మాణిక్యత్వం గగనమణిభి స్సాంద్రఘటితం
కిరీటం తే హైమం హిమగిరి సుతే కీర్తయతి యః,
స నీడేయచ్ఛాయాచ్ఛురణ శబలం చన్ద్రశకలం
ధను శ్శౌనాసీరం కిమితి న నిబధ్నాతి ధిషణామ్. **42**

భగవతీ! ఆకాశంలో ప్రకాశిస్తున్న ద్వాదశా దిత్యులనే మాణిక్యాలచే కూర్చబడి చెక్కబడినదైన నీ బంగారు కిరీటాన్ని ఎవడు వర్ణిస్తున్నాడో ఆ కవీంద్రుడు గోళాకారమైన ఆ నీ కిరీటంలో పొదగబడిన వివిధములైన రత్నకాంతులుగల నీకు పాపటబొట్టైవున్న చంద్రరేఖను కాంచి అది నిజంగా ఇంద్రధనుస్సే ఐవుంటుందని ఎందుకు భావించడు ?

శ్లో॥ ధునోతు ధ్వాన్తం న స్తులిత దళితేన్దీవర వనం
ఘనస్నిగ్ధశ్లక్ష్ణం చికుర నికురుంబం తవ శివే
యదీయం సౌరభ్యం సహజముపలబ్ధుం సుమనసో
వసన్త్యస్మి న్మన్యే వలమథనవాటీవిటపినామ్. **43**

అమ్మా! శ్రీదేవి! అప్పుడే వికసిస్తూన్న నల్లకలువలకు దీటైనదీ, కారు మొగులువలె దట్టమై, చిక్కనై, నునుపై, సుగంధి తైలముతో కూడుకొన్నదివలె మృదులమైన నీ నెరికురుల మొత్తం మా అజ్ఞానాన్ని పోగొట్టుగాక! నీ కేశపాశం యొక్క సహజ సౌరభాన్ని ప్రాపించటానికి మహేంద్రుడి ఉద్యానవనంలోని కల్పవృక్షాల పుష్పాలు నీ కేశ సముదాయాన్ని ఆశ్రయించి వసించివున్నవి.

శ్లో॥ తనోతు క్షేమం న స్తవ వదనసౌందర్యలహరీ
పరీవాహస్రోతస్సరణిరివ సీమన్తసరణిః
వహన్తీ సిన్దూరం ప్రబల కబరీభార తిమిర
ద్విషాం బృన్దై ర్బన్దీకృతమివ నవీనార్క కిరణమ్. **44**

జగన్మాతా ! పొంగుతూ జాలువారే నీముఖ సౌందర్య ప్రవాహంలో చీలి చక్కగా ప్రవహించి నీటిపాయ వెల్లి దారిమాదిరి కనిపించే నీ పాపటిదారి ఎంతో బలంగల కేశపాశాల సముదాయాలచే బందీగా చేసుకొన్న బాలభానుడి కిరణాల మాదిరి సిందూరపు బొట్టును ధరించినదై మాకు యోగక్షేమాలను కలుగచేయుగాక!

శ్లో॥ అరాళైస్స్వాభావ్యా దళికలభసశ్రీభిరలకైః
పరీతం తే వక్త్రం పరిహసతి పఙ్కేరుహరుచిమ్,
దరస్మేరే యస్మిన్ దశనరుచికిఞ్జల్కరుచిరే
సుగన్ధౌ మాద్యన్తి స్మరదహన చక్షుర్మధులిహః. **45**

అమ్మా! తుమ్మెదల చాయగలవై వక్రములైన ముంగురులచే ఆవృతమై నీ వదనం పద్మంయొక్క సొబగును పరిహసిస్తోంది. చిరునగవుల పంటి తళుకులనే కింజల్కలాల (అకరు పువ్వుల) అందమైన సుగంధంగల ఆ మోమునందు మన్మథుణ్ణి జయించిన శివుడి చూడ్కులనే తుమ్మెదలు ముదమందుతూ మత్తుగొంటున్నవి.

శ్లో॥ లలాటం లావణ్యద్యుతివిమల మాభాతి తవ యత్
ద్వితీయం తన్మన్యే మకుటఘటితం చన్ద్రశకలమ్,
విపర్యాసన్యాసా దుభయ మపి సమ్భూయ చ మిథః
సుధాలేపస్యూతిః పరిణమతి రాకాహిమకరః. **46**

అమ్మా! కళ్యాణీ! వెన్నెలవంటి సౌందర్యంలో విమలవై భాసిల్లుతున్న, మకుట ఘటితమైన నీ లలాటాన్ని ద్వితీయ చంద్రఖండంగా తలచుతాను. నీ సిగపూవు అరజాబిలీ, నొసటి అర జాబిలీ రెండూ పరస్పరం కలయికచెంది సుధారస సాంద్రమైన చంద్రబింబంగా పరిణమిస్తోంది.

శ్లో॥ భ్రువౌ భుగ్నే కించిద్భువనభయభఙ్గవ్యసనిని
త్వదీయే నేత్రాభ్యాం మధుకరరుచిభ్యాం ధృతగుణమ్,
ధను ర్మన్యే సవ్యేతరకరగృహీతం రతిపతేః
ప్రకోష్ఠే ముష్టౌంచ స్థగయతి నిగూఢాన్తర ముమే. **47**

భగవతీ!సమస్త లోకాలకు కలిగే కష్టాలను తొలగించటంలో ఆసక్తిగల ఓ తల్లీ! ఇంచుక వంగిన నీదైన కనుబొమలను తుమ్మెదలవంటి కాంతిగల కన్నులచేత కట్టబడిన అల్లెత్రాడుగల మన్మథుడి యొక్క (కుడిదాని కంటె వేరైన) ఎడమ చేతితో గైకోబడినదీ, ముంజేయి పిడికిలి కప్పుచున్నవి అవుతూండగా చూపరులకు కానరాక దాగిన వింటి నడిమి భాగం గలదైన విల్లు అని తలచుచున్నాను.

శ్లో॥ అహస్సూతే సవ్యం తవ నయనమర్కాత్మకతయా
త్రియామాం వామం తే సృజతి రజనీనాయకతయా,
తృతీయా తే దృష్టి ర్దరదళితహేమామ్బుజరుచి,
స్సమాధత్తే సన్ధ్యాం దివసనిశయో రన్తరచరీమ్. **48**

ఓ హ్రీంకారీ! నీ కుడికన్ను సూర్యాత్మకమైన పగటిని సృష్టిస్తోంది. నీ ఎడమ కన్ను చంద్రాత్మకమైన రాత్రిని పుట్టిస్తోంది. కొద్దిగా వికసించిన సువర్ణకమలము వంటి నీ మూడవ నేత్రం దివారాత్రాల నడుమ చరించేదైన సంధ్యను ఏర్పరుస్తోంది.

శ్లో॥ విశాలా కల్యాణీ స్ఫుటరుచి రయోధ్యా కువలయైః
కృపాధారాఽఽధారా కిమపి మధురాఽఽభోగవతికా,
అవన్తీ సృష్టి, స్తే బహునగర విస్తారవిజయా
ధ్రువం తత్తన్నామవ్యవహరణయోగ్యా విజయతే. **49**

ఓ మాతా! నీ దృష్టి విశాలమైనది, శుభమునిచ్చునది. కమలముల ప్రస్ఫుట కాంతి కలిగి అయోధ్యయై, కృపాధారలకు ఆధారమవుతూ ఉన్నది. అవ్యక్త మధురమయినది, అభోగవతి అవుతూ

భోగవతియై, అవంతియై, జయోజ్జ్వల అవుతూ విజయయై. ఆయా నగరాల నామాలు వ్యవహరించదగినదై సర్వోత్కర్షతో వర్తిస్తోంది.

(విశాల, కల్యాణి, అయోధ్య, మధుర, భోగవతి, అవంతి, విజయ అనేఎనిమిది నగరాలున్నవి. అలాగే వనితాజన సామాన్యాలయిన ఎనిమిది చూపులున్నవి. శ్రీదేవిలో ఇవి సంక్షోభణ, ఆకర్షణ, ద్రావణ, ఉన్మాదన, వశ్య ఉచ్చాటన, విద్వేషణ, మారణ క్రియాకారకాలు.)

శ్లో॥ కవీనాం సన్దర్భస్తబక మకరన్దై కరసికం
కటాక్షవ్యాక్షేప భ్రమరకలభౌ కర్ణయుగళమ్,
అముఞ్చన్తౌ దృష్ట్వా తవ నవరసాస్వాదతరళౌ
అసూయాసంసర్గా దలికనయనం కిఞ్చిదరుణమ్. **50**

జగన్మాతా! కావ్యాలనే పుష్పగుచ్ఛంలోని మకరందాన్ని గ్రోలటంలో ఎంతో మక్కువ గలదైన నీ వీనుల జంటను చూసి కడగంటి చూపు లను నెపాన వర్తించే తుమ్మెద కొదమలు రెండూ శృంగారాది నవరసాస్వాదనంలో అత్యంతాసక్తిగలవై ఆ కర్ణయుగళాన్ని విడువకపోవటాన్ని చూసి పైభాగంలో వున్న నీ ఫాలనేత్రం అసూయతోడి కూడిక వలన కినుక వహించినదై ఇంచుక కెంపువన్నె గలదై ఒప్పుతోంది.

శ్లో॥ శివే శృఙ్గారార్ద్రా తదితరజనే కుత్సనపరా
సరోషా గఙ్గాయాం గిరిశ చరితే (నయనే) విస్మయవతీ,
హరాహిభ్యో భీతా సరసిరుహ సౌభాగ్యజననీ
సఖీషు స్మేరా తే మయి జనని దృష్టిస్సకరుణా. **51**

అమ్మా ! గిరిజా! నీ దృష్టి శివునిపట్ల శృంగారరసం వెదజల్లేదీ, శివుడికంటె యితరులైన వారిపట్ల ఏవగింపు కలదిగానూ, సపత్ని ఐన గంగాదేవి పట్ల రోషం వహించినదీ, శివునియొక్క చరితముపట్ల విస్మయం కలిగినదీ, శివుని ఆభరణాలైన సర్పములపట్ల భీతిగొన్నదీ, కమలాల సౌభాగ్యాన్ని జయించేదీ, చెలులపట్ల వికాసం కలదీ, నాపట్ల కరుణాభరితంగాను ఒప్పుతోంది. దేవి దృష్టి నవరసభరితమని భావం.

శ్లో॥ గతే కర్ణాభ్యర్ణం గరుత ఇవ పక్ష్మాణి దధతీ
పురాం భేత్తు శ్చిత్తప్రశమరస విద్రావణఫలే,
ఇమే నేత్రే గోత్రాధరపతి కులోత్తంసకలికే
తవాకర్ణాకృష్ట స్మరశరవిలాసం కలయతః. **52**

ఓ పర్వతపుత్రీ! ధ్యానసమయంలో నా హృదయకమలంలో ప్రత్యక్షమై చూపట్టుతూన్న నీ యొక్కనేత్రాలు చెవుల చెంతను చేరినవై ఈకలవలె రెప్ప వెంట్రుకలను ధరిస్తూన్నవై శివుడి చిత్తగత శాంతరసాన్ని చీల్చి నాశం పొందించటమే ప్రయోజనంగా గలవై చెవి కొనలవరకు లాగబడిన మన్మథుడి బాణాలయొక్క సొగసును చూపట్టుతూన్నవై వున్నవి.

శ్లో॥ విభక్తత్రైవర్ణ్యం వ్యతికరితలీలాఞ్జనతయా
విభాతి త్వన్నేత్రత్రితయ మిద మీశానదయితే,
పునస్స్రష్టుం దేవా౯ ద్రుహిణహరిరుద్రానుపరతా౯
రజ స్సత్వం బిభ్ర త్తమ ఇతి గుణానాం త్రయమివ.53

ఓశర్వాణీ! మూడునేత్రములు కాటుక కలవి కావటంలో కలయిక చెందని తెలుపు, నలుపు, ఎరుపు అనే మూడు వన్నెలుగలదై మహాప్రళయకాలంలో నీలో లీనమై పోయివున్న బ్రహ్మ విష్ణు రుద్రులను తిరిగి సృష్టించటాన్కి సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణత్రయాన్ని ధరిస్తూన్నదివలె ప్రకాశిస్తోంది.

శ్లో॥ పవిత్రీకర్తుం నః పశుపతిపరాధీన హృదయే
దయామిత్రై ర్నేత్రై రరుణధవళ శ్యామరుచిభిః,
నద శ్శోణో గఙ్గా తపనతనయేతి ధ్రువ మయమ్
త్రయాణాం తీర్థానా ముపనయసి సమ్భేద మనఘమ్.54

శివునికివశమైన హృదయం కలిగిన తల్లీ! కరుణారసంతో కూడుకొనటంచేత మృదువైన ప్రసన్నమైన చూపులుగలవై, ఎర్రటి నల్లటి కాంతులుగల నీ కన్నులచే పాపహరాలైన మూడు తీర్థాలైన శోణ (ఎర్రని) గంగా (తెల్లని) యమునా (నల్లని) నదుల సంగమాన్ని మమ్మల్ని పునీతులను చేయటం నిమిత్తం తెస్తున్నావు. ఇది నిజం.

శ్లో॥ నిమేషోన్మేషాభ్యాం ప్రళయ ముదయం యాతి జగతీ
తవే త్యాహు స్సన్తో ధరణిధర రాజన్య తనయే
త్వదున్మేషాజ్జాతం జగదిద మశేషం ప్రళయతః
పరిత్రాతుం శఙ్కే పరిహృతనిమేషా స్తవ దృశః. 55

ఓ హిమగిరిపుత్రీ! నువ్వు కన్నులను మూయటం తెరవటం వల్ల యీ జగత్తు నశిస్తుంది, జనిస్తుంది – అని సత్పురుషులు చెబుతారు. నువ్వు కన్నులు తెరవటం వలననే జనించిన సర్వజగత్తును ప్రళయంలో నశించకుండేట్లు నువ్వు కన్నుల రెప్పలను మూయనే ముయ్యవని నేను ఊహిస్తున్నాను.

శ్లో॥ తవాపర్ణే కర్ణే జపనయన పైశున్య చకితాః
నిలీయన్తే తోయే నియత మనిమేషా శ్శఫరికాః,
ఇయంచ శ్రీ ర్బద్ధచ్ఛదపుట కవాటం కువలయం
జహాతి ప్రత్యూషే నిశిచ విఘటయ్య ప్రవిశతి. **56**

ఓ అపర్ణా! పార్వతీ! నీ చెవుల వరకు ఉన్న (కొండెములు చెప్పునట్లు) నీ నయనాలు తమ రహస్యాన్ని వెల్లడిస్తవని భయపడి శఫరికలు (బేడిస చేపలు) నీటిలో దాగినవి (దేవి నేత్రాలకున్న అనిమేషత తమ కన్నులకు వుండటంవల్ల తమయందు దొంగతనం ఆరోపించబడుతుందని భయం.) ఇక నేత్రలక్ష్మి రాత్రిసమయంలో కలువయందు వుండి ఉదయాన దాన్ని దళాలలో మూసివచ్చి పగలంతా నీ నేత్రాలలో వుండి తిరిగి రాత్రివేళ దళాల తలుపులు తెరచుకొని కలువను చేరుతోంది. (దేవి నయనాలకు సామ్యమైన వస్తువు లేదని భావం).

శ్లో॥ దృశా ద్రాఘీయస్యా దరదళితనీలోత్పల రుచా
దవీయాంసం దీనం స్నపయ కృపయా మా మపి శివే!
అనే నాయం ధన్యో భవతి నచతే హాని రియతా
వనేవా హర్మ్యేవా సమకరనిపాతో హిమకరః. **57**

ఓ భవానీ ! ఎంతో నిడుపైన, యించుక వికసించిన నల్లకలువ కాంతి వంటి నీ కడగంటి చూపును సుదూరంలో వున్న దీనుడనైన నాపై దయతో ప్రసరించు. దీనివల్ల నేను ధన్యుడ నవుతాను. ఇంతమాత్రాన నీకు ఏ నష్టములేదు. చల్లని కిరణాలు గలవాడైన చంద్రుడు, అరణ్యంలోగాని రాజప్రాసాదంలో గాని తన కిరణాలను సమానంగానే ప్రసరింప చేస్తాడు గదా!

శ్లో॥ అరాళం తే పాళీయుగళ మగరాజన్యతనయే!
న కేషా మాధత్తే కుసుమశరకోదణ్డ కుతుకమ్
తిరశ్చీనో యత్ర శ్రవణపథ ముల్లఙ్ఘ్య విలస
న్నపాఙ్గవ్యాసఙ్గో దిశతి శరసన్ధానధిషణామ్. **58**

ఓ శైలరాజ తనయా! నీ కడతల జంట (చెవుల జంటకు కనుగవకు నడిమి ప్రదేశం) మన్మథుడి విల్లును స్ఫురణకు తెచ్చుచున్నది. ఎందుకంటె నీ కనుగొనల కటాక్ష ప్రకాశం అడ్డంగా తిరిగి చెవి త్రోవను దాటి మెరుస్తూన్నదై బాణాలు సంధించబడుతున్నవన్న ఊహను కలిగిస్తోంది (అపాంగ వీక్షణాలను పువ్వుల బాణాలని తలచి శ్రీదేవి కడతల జంట మన్మథుడి విల్లని భ్రమ కలుగుతోంది).

శ్లో॥ స్ఫురద్గణ్డాభోగ ప్రతిఫలిత తాటఙ్కయుగళం
చతుశ్చక్రం మన్యే తవ ముఖమిదం మన్మథరథమ్,
య మారుహ్యద్రుహ్య త్యవనిరథ మర్కేన్దు చరణం
మహావీరో మారః ప్రమథపతయే సజ్జితవతే. **59**

ఓ శర్వాణీ! అద్దం మాదిరి నిగనిగ మెరుస్తూన్న నీ విశాలమైన చెక్కిళ్లలో ప్రతిఫలిస్తూన్న రతనాల కమ్మల జంటగల నీ ముఖారవిందాన్ని మన్మథుడి రథంగా తలచుచున్నాం. నీ నెమ్మొగమునే తేరును అధిష్టించి ఆ ప్రభావం చేతనే మహావీరుడైన మన్మథుడు, సూర్యచంద్రులు చక్రాలుగా భూమి అనే రథాన్ని అధిరోహించి యుద్దానికి సిద్ద మవుతూన్న త్రిపురాంతకుడైన రుద్రుడికి ద్రోహం చేస్తున్నాడు.

శ్లో॥ సరస్వత్యా సూక్తీ రమృతలహరీ కౌశలహరీః
పిబన్త్యా శ్శర్వాణీ శ్రవణచులుకాభ్యా మవిరళమ్,
చమత్కార శ్లాఘా చలితశిరసః కుణ్డలగణో
ఝణత్కారై స్తారైః ప్రతివచన మాచష్ట ఇవ తే. **60**

ఓ రుద్రాణీ ! అమృత ప్రవాహము వంటి, నీ మధుర వచనాలను నిరంతరం గ్రోలుచున్నదై, చమత్కారాలను శ్లాఘించటంలో శిరస్సు గదల్చగా, సరస్వతీదేవి కుండలముల ఝణాత్కారములు నీకు ప్రతివచన మిస్తూన్నట్లుంది.

శ్లో॥ అసౌ నాసావంశ స్తుహినగిరివంశధ్వజపటి
త్వదీయో నేదీయః ఫలతు ఫలమస్మాక ముచితమ్,
వహత్యన్త ర్ముక్తా శ్శిశిరకర నిశ్వాస గళితం
సమృద్ధ్యా య త్తాసాం బహిరపి స ముక్తామణిధరః.**61**

హిమ వంతుని వంశానికి పతాకవంటి ఓ తల్లీ! నీ నాసావంశమునందు ముత్యాలు వున్నవనటానికి సందేహంలేదు. ఎందుకంటె నాసికలోపల ముత్యాలు లేకుంటె శ్వాస వదలేటప్పుడు ముత్యమెందుకు

వెలువడుతుంది. ఆ నాసాదండం నా వారికీ నాకూ ఆ జారిన ముత్యాన్ని ధరించి త్వరలో కోరికను నెరవేర్చుదువుగాక!

శ్లో॥ ప్రకృత్యాఽఽరక్తాయా స్తవ సుదతి దన్తచ్ఛదరుచేః
ప్రవక్ష్యే సాదృశ్యం జనయతు ఫలం విద్రుమలతా,
న బిమ్బం తద్బింబప్రతిఫలనరాగా దరుణిమం
తులా మ ధ్యారోఢుం కథమివ న లజ్జేత కలయా. 62

అంబా! సహజంగా ఎఱ్ఱనైన నీ పెదవుల సొబగుకు సరైన పోలికను చక్కగా చెప్పుచున్నాను. పగడపు తీగె పండు పండుతే ఆ విద్రుమఫలం నీ పెదవుల కాంతికి సాటి అవుతోంది. కేవలం పగడపు తీగె సాటి కాలేదు. బింబఫలము నీ అధర బింబప్రతిఫలన రక్తిమవలన ఎరుపెక్కింది. కాబట్టి ఆ బింబఫలం నీ అధరచ్ఛాయతో తులతూగటానికి ఎలా లజ్జపడకుండ వుంటుంది ?

శ్లో॥ స్మితజ్యోత్స్నాజాలం తవ వదనచన్ద్రస్య పిబితాం
చకోరాణామాసీ దతిరసతయా చఞ్చుజడిమా,
అతస్తే శీతాంశో రమృతలహరీ రామ్లరుచయః
పిబన్తి స్వచ్ఛన్దం నిశి నిశి భృశం కాఞ్జిక ధియా. 63

ఓ భవానీ ! నీ ముఖ చంద్రుడి చిరునగవనే వెన్నెలను గ్రోలుతూన్న చకోరపక్షులకు ఆ వెన్నెల అతిమధురం అవటంతో నాలుకలు మొద్దుబారినవైనవి. అందువల్ల అవి పులుపు రసంలో ఆసక్తిగొన్నవై చంద్రుడి అమృతపు వెల్లువను అన్నపుగంజి అనే భ్రాంతితో ప్రతి రాత్రియందు స్వేచ్ఛగా త్రాగుతున్నవి.

శ్లో॥ అవిశ్రాన్తం పత్యు ర్గుణగణకథా మ్రేడనజపా
జపాపుష్పచ్ఛాయా తవ జనని జిహ్వా జయతి సా,
యదగ్రాసీనాయాః స్పటిక దృషదచ్ఛచ్ఛవిమయీ
సరస్వత్యా మూర్తిః పరిణమతి మాణిక్యవపుషా. 64

ఓ శ్రీకరీ ! నీ సుప్రసిద్ధమైన నాలుక సదా పతి ఐన సదాశివుడి గుణగణాలను మరిమరి వల్లించటమనే జపం గలదై దాసాని పువ్వు ఎఱ్ఱని ఛాయ గలదై ప్రకాశిస్తోంది. నీ జిహ్వాగ్రంలో సుఖాసీనయై నెలకొన్న సరస్వతీదేవి యొక్క స్ఫటికమణివంటి తెల్లని స్వరూపం నీ నాలుకయందలి ఎర్రని కాంతి సోకి రక్తవంతమై మాణిక్య స్వరూపాన్ని పొందుతోంది.

శ్లో॥ రణే జిత్వా దైత్యా నపహృతశిరస్త్రైః కవచిభి
ర్నివృత్తై_ శ్చణ్డాంశత్రిపురహర నిర్మాల్యవిముఖైః
విశాఖేన్ద్రో పేన్ద్రై శ్శశివిశద కర్పూరశకలాః
విలీయన్తే మాత స్తవ వదన తామ్బూల కబళాః. 65

ఓ తల్లీ! సంగ్రామంలో రాక్షసులను జయించి తన తలపాగలను తీసివేసి కవచాలు ధరించిన వారై రణరంగంనుంచి మరలివస్తూ, చండీశ్వరుడిచే అనుభవింప దగిన శివ నిర్మాల్యము నిష్టపడని కుమారస్వామి, విష్ణు, దేవేంద్రులు, చంద్రుడివలె స్వచ్ఛములై నిర్మలమైన పచ్చకర్పూరపు తునకలు గలవైన నీ నోటినుంచి వెలువడి వచ్చిన తాంబూల విడెమును తినుటకుత్సాహించుచున్నారు.

శ్లో॥ విపఞ్చ్యా గాయన్తీ వివిధమపదానం పశుపతే
స్త్వయారబ్ధే వక్తుం చలిత శిరసా సాధువచనే,
తదీయై ర్మాధుర్యై రపలపిత తన్త్రీకలరవాం
నిజాం వీణాం వాణీ నిచుళయతి చోళేన నిభృతమ్.66

శర్వాణీ! సరస్వతీదేవి వీణను శృతిచేసి నీ ఎదుట పశుపతి వీరగాథలను గానం చేస్తూంటె నువ్వు ఆనందం పొంది ఆమె పాటను మెచ్చుకొంటూ ప్రశంసా వాక్యాలు చెప్పబోతూంటె నీ వాఙ్మాధుర్యం తన వీణానాదంకంటె మాధుర్యం గలదని తెలిసి ఆమె తన వీణను పైముసుగుతో కనపడకుండా ఆచ్ఛాదిస్తోంది.

శ్లో॥ కరాగ్రేణ స్పృష్టం తుహినగిరిణా వత్సలతయా
గిరీశే నోదస్తం ముహు రధరపానాకులతయా,
కరగ్రాహ్యం శమ్భో ర్ముఖముకుర వృన్తం గరిసుతే
కథంకారం బ్రూమ స్తవ చుబుక మౌపమ్యరహితమ్.67

ఓ హిమగిరి తనయా! తండ్రి ఐన హిమవంతుడిచే ప్రేమతో మునివ్రేళ్లతో తాకబడినదీ అధరపానమున చేయుటకు కైలాసపతిచేత మాటిమాటికి పైకెత్తబడినదీ, సాటిలేనిదీ, ముఖమనే అద్దంయొక్క పిడీ ఐన నీ చుబుకాన్ని ఏమని వర్ణించగలను?

శ్లో॥ భుజాశ్లేషా న్నిత్యం పురదమయితుః కణ్టకవతీ

తవ గ్రీవా ధత్తే ముఖకమలనాళశ్రియ మియమ్,
స్వత శ్శ్వేతా కాలాగరు బహుళజమ్బాలమలినా
మృణాళీ లాలిత్యం వహతి యదధో హారలతికా. **68**

ఓ కాంతిమతీ ! నీ యీ కంఠం శివుని ఆలింగనంతో గగుర్పాటు నొందినదై ముఖపద్మానికి నాళంవంటి దవుతోంది. నీ కంఠానికి కిందిభాగాన సొంపారుతూ స్వభావసిద్ధంగానే తెల్లనై స్వచ్ఛమైన నీ యీ ముత్యాలపేరు తీవె నల్ల అగరుగంధపు టసలు నీలివన్నెచే తామరతూడు చక్కదనాన్ని పొందుతూన్నది.

శ్లో॥ గళే రేఖాస్తిస్రో గతిగమకగీతైక నిపుణే
వివాహవ్యానద్ధప్రగుణ గుణసంఖ్యా ప్రతిభువః,
విరాజన్తే నానావిధ మధుర రాగాకరభువాం
త్రయాణాం గ్రామాణాం స్థితినియమ సీమాన ఇవ తే.**69**

నీ కంఠంలోని మూడు భాగ్యరేఖలు వివాహ సమయాన శంభుడు కట్టిన సూత్రాలను జ్ఞప్తికి తెస్తూ నానావిధాలై మధురాలైన రాగాలకు నివాసాలయిన షడ్జ, మధ్యమ, గాంధారములను గ్రామముల ఉనికి యొక్క నియమం కోసం ఏర్పరచిన సరిహద్దుగా వున్నట్లు ప్రకాశిస్తున్నవి.

శ్లో॥ మృణాళీమృద్వీనాం తవ భుజలతానాం చతసృణాం
చతుర్భి స్సౌన్దర్యం సరసిజభవ స్స్తౌతి వదనైః,
నఖేభ్య స్సన్త్ర స్యన్ ప్రథమ మథనాదన్ధకరిపో
శ్చతుర్ణాం శీర్షాణాం సమ మభయహస్తార్పణధియా.**70**

ఓ శాంకరీ!తామరతూడవలె మృదువైన నీ నాలుగు భుజాల చక్కదనాన్ని గాంచి, సరసిజభవుడు(బ్రహ్మ) నాలుగు మోములతో, పూర్వం తన ఐదవ శిరస్సును గోటితో గిల్లివేసిన శివుడి గోళ్ళకు భయపడుతున్న వాడై, తన నాలుగు శిరస్సులకు, నీ నాలుగు హస్తాలనుంచి అభయదానం కోరుతూ నిన్ను స్తుతిస్తున్నాడు.

శ్లో॥ నఖానా ముద్యోతై ర్నవనళినరాగం విహసతాం
కరాణాం తే కాన్తిం కథయ కథయామః కథ ముమే,
కయాచిద్వా సామ్యం భజతు కలయా హస్త కమలం

యది క్రీడ ల్లక్ష్మీచరణ తలలాక్షారసచణమ్.   71

ఓ పార్వతీ!నూతనమగు పద్మకాంతిని పరిహాసంచేస్తూన్న నీ గోళ్ల కాంతి చేత విలసిల్లే నీ హస్తాల శోభాసౌందర్యాన్ని ఏ మని పొగడగలం? క్రీడిస్తూన్న లక్ష్మీదేవి చరణాల లత్తుక రసమున కేసౌటికాని కమలం ఎలా నీ కరాల కాంతికి సమానం కాగలుగుతుంది!

శ్లో॥ సమం దేవి స్కన్దద్విప వదనపీతం స్తనయుగం
త వేదం నః ఖేదం హరతు సతతం ప్రస్నుతముఖమ్,
య దాలోక్య శఙ్కాకులితహృదయో హాసజనకః
స్వకుమ్భౌ హేరమ్బః పరిమృశతి హస్తేవ ఝటితి.   72

ఓ దేవి నీస్తనద్వయమును చూసి, తన కుంభములేమోనని సందేహించి వినాయకుడు తన కుంభస్థలమును తడిమి చూచుకొంటూ నవ్వు తెప్పిస్తున్నాడు. ఏ స్తనద్వయం గణపతి కుమారస్వాములచేత పానం చేయబడినదో ఆ స్తనద్వయం మా క్లేశాలను తొలగించుగాక!

శ్లో॥ అమూ తే వక్షోజౌ వమృతరస మాణిక్యకుతుపౌ
న సన్దేహస్పన్దో నగపతిపతాకే మనసి నః,
పిబన్తౌ తౌ యస్మా దవిదితవధూ సఙ్గరసికౌ
కుమారా వద్యాపి ద్విరద వదనక్రౌఞ్చదళనౌ.   73

హిమవంతుని వంశానికి కీర్తి కలిగించు ఓ జననీ ! వినాయకుడూ కుమారస్వామీ సదా కుమారులై వుండటానికి కారణం ఏమంటె శ్రీదేవి అమృత స్తన్యాన్ని త్రావుతూ వారు సదా బాలురుగా వున్నారు.

శ్లో॥ వహ త్యమ్బ స్తమ్బేరమదనుజ కుమ్భ ప్రకృతిభిః
సమారబ్ధాం ముక్తామణిభిరమలాం హారలతికామ్,
కుచాభోగో బిమ్బాధరరుచిభి రన్త శ్శబలితాం
ప్రతాపవ్యామిశ్రాం పురదమయితుః కీర్తి మివ తే.   74

జగదీశ్వరీ! పరమేశ్వరుడు గజాసురుణ్ణి వధించి అతని కుంభస్థలం నుంచి తెచ్చిన కర్పూరాభమైన ముత్యాలమణిహారం నీ కుచమండలాన అలంకారంగా నెలకొని దొండపండువంటి నీ అధరబింబంయొక్క ఎర్రని కాంతులచేత శబలితమై పురదమనుడి (శివుడి) కీర్తిని, ప్రతాపాన్ని ధరించినట్లున్నది.

శ్లో॥ తవస్తన్యం మన్యే ధరణిధరకన్యే హృదయతః
పయఃపారావారః పరివహతి సారస్వత మివ,
దయావత్యాదత్తం ద్రవిడశిశు రాస్వాద్య తవ యత్
కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా. 75

ఓ పర్వతపుత్రీ! యామృత క్షీరమును ద్రవిడ బాలుడు (శ్రీశంకరుడు) త్రాగి, గొప్పకవులకు ఇంపగు కవిత్వమును చెప్పెను. నీ స్తన్యము హృదయము నుండి క్షీరసముద్రము వలె భాషను విరివిగ ప్రవహింపచేయుచున్నది.

శ్లో॥ హరక్రోధజ్వాలావళిభి రవలీఢేన వపుషా
గభీరే తే నాభీసరసి కృతసఙ్గో మనసిజః,
సముత్తస్థౌ తస్మా దచలతనయే ధూమలతికా
జన స్తాం జానీతే తవ జనని లోమావళి రితి. 76

ఓ పార్వతీ! శివుని కోపపు మంటలచే ఆవృతమైన శరీరంతో మన్మథుడు లోతైన పొక్కిలి అనే నీ నాభిసరస్సులో దూకి శరీరాన్ని రక్షించుకొన్నాడు. ఆ సమయంలో నీ నాభిసరస్సునుంచి నిప్పుకలు చల్లారటం వల్ల జనించిన పొగనే లోకం నీ నూగారుగా తెలుసుకొంటోంది.

శ్లో॥ యదే తత్కాళిన్దీ తను తరతరఙ్గాకృతి శివే
కృశే మధ్యే కిఞ్చి జ్జనని తవ య ద్భాతి సుధియామ్,
విమర్దా దన్యోన్యం కుచకులశయో రన్తరగతం
తనూభూతం వ్యోమ ప్రవిశదివ నాభిం కుహరిణీమ్.77

ఓ భవానీ! యమునా తరంగంవలె సన్ననిదై నీ కృశమధ్యంలో అగపడే నూగారనే చిన్నవస్తువును చూసి యోచించగా – నీ కుచముల మధ్యనున్న ఆకాశం ఆ కుచములు రెండు పరస్పరం ఒరయటంవల్ల ఆ ఒరపిడికి తాళలేక నలిగినల్లనై సన్నగా కిందికి నాభివరకు లక్క జారినట్లు జారినదిగా వున్నది.

శ్లో॥ స్థిరో గఙ్గావర్తః స్తనముకుళ రోమావళిలతా
కలావాలం (కులావాలం) కుణ్డం కుసుమ శరతేజో
హుతభుజః

రతేర్లీలాగారం కిమపి తవ నాభి ర్గిరిసుతే
బిలద్వారం సిద్ధే ర్గిరిశ నయనానాం విజయతే. **78**

ఓ శంకరీ! నీ నాభి గంగానది సుడిగాను, స్తనములనే పూమొగ్గలకు ఆధారమైన రోమరాజి అనే తీగయొక్క పాదుగాను, మన్మథుడి తేజస్సనే అగ్నికి హోమకుండంగాను, మరుని చెలువ ఐన రతీదేవికి శృంగారభవనంగాను, నీ పతి ఐన సదాశివుడి నయనాల తమస్సిద్ధికి గుహాద్వారమై, అనిర్వాచ్యమై, అతిసుందరమై సర్వోత్కర్షతో ప్రకాశిస్తోంది.

శ్లో॥ నిసర్గక్షీణస్య స్తనతటభరేణ క్లమజుషో
నమన్మూర్తే ర్నారీతిలక శనకైస్త్రుట్యత ఇవ,
చిరం తే మధ్యస్య త్రుటితతటినీతీర తరుణా
సమావస్థా స్థేమ్నో భవతు కుశలం శైలతనయే. **79**

ఓ గిరిరాజ తనయా! స్వాభావికముగా సన్నదియు స్తన భారంచేత బడలినదీ, వంగిన ఆకాశం గలదీ, మెల్లగా తెగుతున్నదో అన్నట్లున్నదీ, కట్ట తెగిన ఏటిగట్టునందలి చెట్టుతో సమానమైన స్థితిని పొందినదీ నిలకడగల నీ నడుమునకు చిరకాలం కుశలం అవుగాక!

శ్లో॥ కుచౌ సద్య స్స్విద్య త్తటఘటిత కూర్పాసభిదురౌ
కషన్తౌ దోర్మూలే కనకకలశాభౌ కలయతా
తవ త్రాతుం భంగా దలమితి వలగ్నం తనుభువా
త్రిధా నద్ధం దేవి త్రివళి లవలీవల్లిభిరివ. **80**

ఓ శ్రీదేవీ ! చెమటకు తడిసిన రవికెను పిగుల్చుచున్నవీ, బాహుమూలల సమీప ప్రదేశాలను ఒరయుచున్నవీ, బంగారు కలశంవలె ఒప్పారుచున్నవీ ఐన కుచములను (స్తనభారంవల్ల) భంగం కలుగ రాదని, వానిని సృజించిన మన్మథుడు అడవి లతలచేత ముప్పేటగా కట్టినా అన్నట్లు నీ పొట్టమీద మూడు మడతలు తోచుతున్నాయి.

శ్లో॥ గురుత్వం విస్తారం క్షితిధరపతిః పార్వతి నిజాత్
నితమ్బా దాచ్ఛిద్య త్వయి హరణ రూపేణ నిదధే
అతస్తే విస్తీర్ణో గురురయ మశేషాం వసుమతీం
నితమ్బ ప్రాగ్భార స్థగయతి లఘుత్వం నయతిచ.**81**

ఓ శైలరాజ తనయా! నీ తండ్రి హిమవంతుడు తన నితంబ (కొండ నడుమ పైనున్న చదునైన) ప్రదేశంనుంచి గొప్పబరువును వైశాల్యాన్ని గ్రహించి నీకు అరణంగా (వివాహ సమయంలో తండ్రి కుమార్తెకు యిచ్చే కానుక) యిచ్చాడు. కాబట్టే నీ పెరుగుదల ఘనత బరువై విశాలమై యీ భూమండలాన్నంతా కప్పుతూ యిలాటి భూమిని తేలికైన దాన్నిగా చేస్తున్నది. దీన్లో సందేహం లేదు.

శ్లో॥ కరీన్ద్రాణాం శుణ్డా కనక కదళీ కాణ్డపటలీం
ఉభాభ్యా మూరుభ్యా ముభయమపి నిర్జిత్య భవతి
సువృత్తాభ్యాం పత్యుః ప్రణతి కఠినాభ్యాం గిరిసుతే
విధిజ్ఞే జానుభ్యాం విబుధకరికుమ్భద్వయమసి. **82**

శాస్త్రముల నెఱిగిన ఓ గౌరీ! నువ్వు గజరాజాల తొండములను, బంగారు అరటి స్తంభాల సముదాయాలను యీ రెంటిని నీ రెండు ఊరువుల (తొడల) చేత జయించి, శోభనములై వర్తులములు కలిగినవీ, భర్త ఐన పరమేశ్వరుడికి మొక్కటంచేత కఠినములైనవీ ఐన మోకాళ్లచేత దిగ్గజాల కుంభస్థలముల జంటలను కూడ జయించి ప్రకాశిస్తూన్నావు.

శ్లో॥ పరాజేతుం రుద్రం ద్విగుణశరగర్భౌ గిరిసుతే
నిషఙ్గౌ జఙ్ఘే తే విషమవిశిఖో బాఢమకృత,
యదగ్రే దృశ్యన్తే దశ శరఫలాః పాదయుగళీ
నఖాగ్ర చ్ఛద్మాన స్సురమకుటశాణైకనిశితాః. **83**

అమ్మా ! ఓ గిరిజా! మన్మథుడు శివుణ్ణి జయించటానికి తన ఐదు బాణాలు చాలవని వాటిని పది బాణాలు చేసుకోనెంచి నీ పిక్కలను అమ్ముల పొదులుగాను, కాలివ్రేళ్లను బాణాలుగాను, నఖాగ్రాలను బాణాల కొనలందు పదనుపెట్టి వుంచిన ఉక్కుముక్కలుగాను గావించుకొన్నాడు. (నమస్కరిస్తూన్న దేవతల కిరీటాలలోని మణులన్న ఒరపిడి రాళ్లయందు నఖాగ్రాలనే ములుకులు పదనుపెట్టబడినవి.)

శ్లో॥ శ్రుతీనాం మూర్ధానో దధతి తవ యౌ శేఖరతయా
మమాప్యేతౌ మాత శ్శిరసి దయ యా ధేహి చరణౌ,
యయోః పాద్యం పాథః పశుపతి జటాజూటతటినీ
యయో ర్లాక్షాలక్ష్మీ రరుణహరి చూడామణి రుచిః.**84**

ఓ జగజ్జననీ ! ఏ నీ చరణములను ఉపనిషత్తులకు సిగపువ్వుగా యున్నాయో. ఓ మాతా! కృపతోకూడిన చిత్తంగల దానవైన నువ్వు ఆ యీ నీ చరణాలను నా శిరస్సుమీదకూడ వుంచు. ఏ నీ చరణాలకు శివుడి జటాజూటంలో వర్తించే గంగ, పాదప్రక్షాళనకు ఉపయోగించే ఉదకం అవుతోందో, ఏ నీ చరణాలకు కెంజాయ వెదజల్లుతూ శ్రీ మహావిష్ణువు కిరీటంలో కూర్చబడిన కౌస్తుభమణి లత్తుక రసంపు కాంతిగా విరాజిల్లుతున్నదో కదా!

శ్లో॥ నమోవాకం బ్రూమో నయనరమణీయాయ పదయోః
త వాస్మై ద్వన్ద్వాయ స్ఫుటరుచిరసాలక్తకవతే,
అసూయత్యత్యన్తం యదభిహననాయ స్పృహయతే
పశూనామీశానః ప్రమదవనకఙ్కేళితరవే. **85**

ఓ భగవతీ! ఏ నీ పాద తాడనాన్ని పశుపతి కోరుతున్నాడో అలరుల తోటలోని అశోకవృక్షాన్ని గాంచి దానిపై అసూయపడుతున్నాడో అలాంటి చూపరుల కనుదమ్ములకు మిగుల సొంపు నింపు గొలిపేదై చక్కగా వెలుగొందుతూన్న కెంపుగొన్న లత్తుక రసంచే తడిసినదై యీ మాకు కనిపిస్తున్న నీ పాదద్వయానికి నమస్కరిస్తున్నాం.

శ్లో॥ మృషా కృత్వా గోత్రస్ఖలన మథ వైలక్ష్యనమితం
లలాటే భర్తారం చరణకమలే తాడయతి తే,
చిరా దన్త శ్శల్యం దహనకృత మున్మూలితవతా
తులాకోటిక్వాణైః కిలికిలితమీశానరిపుణా. **86**

ఓ రుద్రాణీ ! పొరపాటుగా నీ దగ్గర సవతి పేరు చెప్పి తరువాత ఏమీ చేయటానికి తోచక వెలవెలబాటుచే లొంగిన భర్తను నీ చరణకమలంతో నుదుట తాడనం జరుపగా గాంచి శివుడికి శత్రువైన మన్మథుడు (ఇలాగైనా తన పగ తీరేట్లు శాస్తి జరిగిందని) నీ కాలి అందెల చివరల్లో గ్రువ్వబడిన చిరుగజ్జెల మ్రోతలచేత కిలకిలారావాన్ని గావించాడు.

శ్లో॥ హిమానీహన్తవ్యం హిమగిరి నివాసైక చతురౌ
నిశాయాం నిద్రాణాం నిశి చరమభాగే చ విశదౌ,
వరం లక్ష్మీపాత్రం శ్రియమతిసృజన్తౌ సమయినాం
సరోజం త్వత్పాదౌ జనని జయత శ్చిత్ర మిహ కిమ్. **87**

ఓ అంబా! హిమాలయమందుండుటకు సమర్థమైనవియు, రాత్రియందూ తెల్లవారుజామునా ప్రసన్నాలైనవీ, సమయాచారులైన నీ భక్తులకు లక్ష్మిని కలిగించేవీ ఐన నీ పాదాలు మంచుచేత నశింపచేయదగినవీ, రాత్రివేళలో ముడుచుకొని పోయేవీ, కొంచెం లక్ష్మీదేవికి తగినవీ ఐన కమలములను జయిస్తున్నవి. ఈ విషయంలో ఆశ్చర్యం ఏమిటి ? ఏమీ లేదు.

శ్లో॥ పదం తే కీర్తీనాం ప్రపద మపదం దేవి విపదాం
కథం నీతం సద్భిః కఠినకమఠీకర్పరతులాం
కథంవా పాణిభ్యా ముపయమనకాలే పురభిదా
యదాదాయ న్యస్తం దృషది దయామానేన మనసా.**88**

ఓ దేవీ! కీర్తులకు స్థానమై, ఆపదలను తొలగించే నీ పాదాగ్రాలను సత్కవులు అతికఠినమైన తాబేటి చిప్పతో సరిపోల్చ ఎలా పూనుకొంటున్నారు? పరమశివుడు వివాహవేళ దయమాన మానసుడై తన చేతులతో వేటిని గ్రహించి ఎలా సన్నెకల్లుపై వుంచాడో కదా!

శ్లో॥ నఖైర్నాక స్త్రీణాం కరకమలసఙ్కోచశశిభిః
స్తరూణాం దివ్యానాం హసత ఇవ తే చణ్డి చరణౌ
ఫలాని స్వస్థేభ్యః కిసలయకరాగ్రేణ దదతాం
దరిద్రేభ్యో భద్రాం శ్రియమనిశ మహ్నాయ దదతౌ. **89**

ఓ దుర్గా! దరిద్రులైన జనానికి మంగళకరమై అధిక సంపదలను తక్షణమే సదా ఒసగుతూండినవైన నీ పాదాల గోళ్ళకాంతి దేవతా స్త్రీల కరపద్మాలను ముకుళింపచేసేటట్టు దేవతలకు కోరికలనిచ్చు కల్పవృక్షమును పరిహసిస్తున్నట్లున్నది.

శ్లో॥ దదానే దీనేభ్యః శ్రియమనిశ మాశానుసదృశీ
మమన్దం సౌన్దర్యప్రకర మకరన్దం వికిరతి,
తవాస్మిన్ మన్దార స్తబక సుభగే యాతు చరణే
నిమజ్జ న్మజ్జీవః కరణచరణై ష్షట్చరణ తామ్. **90**

అమ్మా, ఓ భగవతీ!దీనులందరికీ దగిన సంపదను ఎల్లప్పుడూ ఇచ్చేదీ , మిక్కుటమైన లావణ్యా సమూహమనే పూదేనియను జల్లుతూన్నదీ, కల్పవృక్ష పుష్పసచ్చము వలె నందమైన నీపాదపద్మంలో, మనస్సుతో కూడి పంచేంద్రియాలురూపాదులుగా గలవాడనైన నేను మునుగుతూ ఆరుకాళ్లు కలిగిన

భ్రమరం యొక్క భావాన్ని పొందుతాను గాక, తమ్మియందు తుమ్మెదలా నీ పాదపద్మంలో నేను మును తూంటాను గాక!

శ్లో॥ పదన్యాసక్రీడా పరిచయమివారబ్ధుగునసః
స్ఖలన్త స్తే ఖేలం భువనకలహంసా న జహతి,
అతస్తేషాం శిక్షాం సుభగమణిమఞ్జీర రణిత
చ్ఛలా దాచక్షాణం చరణకమలం చారుచరితే. **91**

చక్కని నడువడి కల ఓ జననీ! నీ పాదవిన్యాస క్రీడాపరిచయాన్ని సముపార్జించ గోరినవైన నీ పెంపుడు హంసలుతొట్రుపాలు చెందుతూ నీ గమన విలాసాన్ని వీడకున్నవి. అందువల్ల నీ పాదకమలం కెంపులు లోనగు రత్నాలు తాపిన అందియ మ్రోతలనే నెపంతో ఆ రాజహంసలకు ఖేలన శిక్షను గరపుతూన్నట్లుగా వున్నది.

శ్లో॥ గతా స్తే మఞ్చత్వం ద్రుహిణహరిరుద్రేశ్వరభృతః
శివ స్స్వచ్ఛచ్ఛాయా కపట ఘటితప్రచ్ఛదపటః,
త్వదీయానాం భాసాం ప్రతిఫలనరాగారుణతయా
శరీరీ శృఙ్గారో రస ఇవ దృశాం దోగ్ధి కుతుకమ్. **92**

తల్లీ ! బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు అనే అధికార పురుషులు నలుగురు మహేశ్వరతత్త్వంలో అంతర్గతులైన వారు కాబట్టి నువ్వు అధిష్టించే మంచంయొక్క నాలుగుకోడులై వున్నారు. సదాశివుడు విమలకాంతి ఘటనారూప వ్యాజాన దుప్పటముగుతూ నీ నెమ్మేని కాంతులు ప్రతిఫలించటం చేత ఎర్రబారి మూర్తిమంతమైన శృంగారరసంవలె నయనాలకు ఆనందాన్ని యిస్తూన్నాడు. (తెల్లని కాంతిగల శివుడు దేలి మేని ఎర్రని కాంతులు ప్రతిఫలించగా ఎర్రనివాడై ఆమెను సేవిస్తున్నాడని భావం.)

శ్లో॥ అరాళా కేశేషు ప్రకృతసరళా మందహసితే
శిరీషాభా చిత్తే దృషదుపలశోభా (దృషదివకఠోరా)
కుచతటే,
భృశం తన్వీ మధ్యే పృథురురసిజారోహవిషయే
జగత్త్రాతుం శమ్భో ర్జయతి కరుణా కాచిదరుణా. **93**

ఓ హైమవతీ ! శంకరుని అరాళా అనే శక్తి నీ కురులలో ప్రకాశిస్తోంది. చిరునవ్వులో ప్రకృతి స్వభావంచేతనే సరళా అనే శక్తి ప్రకాశిస్తూంది. చిత్తంలో దిరిసెన పువ్వులాగు మహామృద్వియు ఐన శక్తి ప్రకాశిస్తోంది. స్తన ప్రదేశంలో సన్నికల్లు శోభగల శక్తి ప్రకాశిస్తోంది. కుచములలో స్థూలశక్తి ప్రకాశిస్తూంది. దేవి జగత్తును రక్షించటానికి అరుణ అనే శక్తీ, కరుణ అనే శక్తీ భాసిల్లుతున్నాయి.

శ్లో॥ కళఙ్కః కస్తూరీ రజనికరబిమ్బం జలమయం
కళాభిః కర్పూరై ర్మరకతకరణ్డం నిబిడితమ్,
అతస్త్వద్భోగేన ప్రతిదిన మిదం రిక్తకుహరం
విధి ర్భూయోభూయో నిబిడయతి నూనం తవ కృతే.**94**

ఓ త్రిలోకసుందరీ! లోకంలోని జనం అజ్ఞానంతో దేన్ని చంద్రమండలమని తలచుతున్నారో, నిజాని కది నీవు కస్తూరి మొదలైన వస్తువులు వుంచుకొనే మరకత మణులచే చేయబడిన భరిణ. చంద్రుడి కలంకంగా భావించబడుతున్నది నువ్వు ఉపయోగించే కస్తూరి. దేన్ని చంద్రుడనుకొంటున్నారో అది నువ్వు జలకమాడే పన్నీరు నింపిన కుప్పె. చంద్రకళలని భావించబడుతున్నవి పచ్చకప్పురపు ఖండాలు. ~~ఈ~~ వస్తువులు నువ్వు వాడుకొనుతూండటంతో రోజురోజు తరిగిపోతూంటె నీదు సేవకుడైన బ్రహ్మ మరల ఆయా వస్తువులను నిండించుచున్నాడు.

శ్లో॥ పురారాతే రన్తఃపురమసి తతస్త్వచ్చరణయో
స్సపర్యామర్యాదా తరళకరణానా మసులభా,
తథా హ్యేతే నీతా శ్శతమఖముఖా స్సిద్ధి మతులాం
తవ ద్వారోపాన్తస్థితిభి రణిమాద్యాభి రమరాః. **95**

ఓఅంబా! నీవు శివునికి పట్టపురాణి వవుతావు. అందువల్ల నీ అడుగు తామరల పూజించే భాగ్యం చపలచిత్తులైన వారికి లభించదు. ఇంద్రుడు మొదలైన దేవతలు నీ ద్వారాల చెంత అణిమాది అష్టసిద్ధులతోపాటు కావలి కాస్తూన్నారు. (చంచలచిత్తులుకాని సమయాచారులకే శ్రీదేవి పాదాంబుజ సేవ లభిస్తుంది. ఇంద్రాదులకైనా కాదు)

శ్లో॥ కళత్రం వైధాత్రం కతికతి భజన్తే న కవయః
శ్రియో దేవ్యాం కోవా న భవతి పతిః కైరపి ధనైః
మహాదేవం హిత్వా తవ సతి సతీనామచరమే
కుచాభ్యా మాసఙ్గః కురవకతరో రప్యసులభః. **96**

ఓ త్రిలోకపూజితా! ఎందరుకవులు సరస్వతీదేవిని సేవించలేదు ? శ్రీదేవియొక్క ఏఏ ధనములచేతనైనా ఏ పురుషుడు పతి, లక్ష్మీపతి కాకున్నాడు? ఓ పతివ్రతలలో అగ్రగణ్యా! మహాదేవుణ్ణి వీడి నీ స్తనాలతోడి ఆలింగనం కరువక తరువునకు (గోరంట చెట్టు) సైతం లభ్యం కాదుకదా! కవి సరస్వతీ పతి అవుతాడు. ధనికుడు లక్ష్మీపతి అవుతాడు. పార్వతీపతి మాత్రం మహాదేవు డొక్కడే అవుతాడు. ఆమె పాతివ్రత్యం అవాఙ్మానసగోచరం అని భావం.

శ్లో॥ గిరా మాహు ర్దేవీం ద్రుహిణగృహిణీ మాగమవిదో
హరేః పత్నీం పద్మాం హరసహచరీ మద్రితనయామ్,
తురీయా కాపి త్వం దురిధిగమనిస్సీమమహిమా
మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మమహిషి.97

ఓ పరబ్రహ్మ స్వరూపిణి! వేదాంతవేత్తలు నిన్ను బ్రహ్మపత్నివైన సరస్వతిగను నిన్నే శ్రీహరి పత్ని లక్ష్మి గను, హరుని సహచరి ఐన గిరి తనయగను భావిస్తారు. కాని నువ్వు యీ మువ్వురికంటె వేరై నాల్గవ దేవియై యిట్టిదట్టిదని వచింపనలవికాని ఆమెవై అనిర్వాచ్యవై దేశకాల వస్తువులకు అపరిచ్ఛిన్నమై భేదించరాని మహాప్రభావం కలిగినట్టిదై శుద్ధవిద్యలో అంతర్గతమైన మహామాయవై, మాయాతత్త్వమవవుతూ, యీ ప్రపంచాన్ని నానావిధాలుగా మోహపెట్టుతున్నావు.

శ్లో॥ కదా కాలే మాతః కథయ కలితాలక్తకరసం
పిబేయం విద్యార్థీ తవ చరణ నిర్ణేజనజలమ్,
ప్రకృత్యా మూకానా మపి చ కవితా కారణతయా
కదా ధత్తే వాణీ ముఖ కమల తామ్బూల రసతామ్.98

ఓ మాతా!, లత్తుక రసంతో కలిసిన నీ పాదప్రక్షాళన జలాన్ని నేను ఎప్పుడు త్రాగుతాను? ఏ నీ పాదప్రక్షాళిత జలం స్వాభావికంగానే చెవిటి వారికి వినే శక్తినీ, మూగవారికి మాట్లాడే శక్తినీ కలిగించేదై గురుశిక్షణ పొందని వారికి కవిత్వరచనా సౌభాగ్యాన్ని ప్రసాదించే కారణంగా వుంటూ సరస్వతీ మోము తామరలోని తమ్ములింపు రసమవటాన్ని ఎప్పుడు ధరిస్తుందో కదా!

శ్లో॥ సరస్వత్యా లక్ష్మ్యా విధిహరి సపత్నో విహరతే
రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేణ వపుషా,
చిరం జీవన్నేవ క్షపిత పశు పాశ వ్యతికరః

పరానన్దాభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్.   99

అమ్మా ! గౌరీ ! నిన్ను సేవించేవాడు సరస్వతితోను, లక్ష్మితోను బ్రహ్మావిష్ణువులకు వైరిగా విహరిస్తున్నాడు. రమ్య శరీరంచే రతీదేవి పాతివ్రత్యాన్ని సడలిస్తూన్నాడు. అంతేగాక జీవుల సంబంధాన్ని, అవిద్యల సంబంధాన్ని తొలగించుకొన్నవాడై జీవన్ముక్తుడై కేవల సదాశివ తత్త్వాత్ముడై పరానంద సుఖాన్ని ఆస్వాదిస్తూన్నాడు.

శ్లో॥ ప్రదీపజ్వాలాభి ర్దివసకరనీరాజనవిధిః
సుధాసూతే శ్చన్ద్రోపలజలలవై రర్ఘ్యరచనా,
స్వకీయైరమ్భోభి స్సలిలనిధి సౌహిత్యకరణం
త్వదీయాభి ర్వాగ్భి స్తవ జనని వాచాం స్తుతి రియమ్.100

ఓ జగన్మాతా! స్వకీయాలైన చేతి దివిటీల జ్వాలలచేత సూర్యుడికి ఆరతి గావిస్తూన్నట్లూ, స్వకీయాలైన చంద్రకాంత మణులవల్ల స్రవిస్తూన్న జలబిందువులచేత చంద్రుడికి అర్ఘ్యం సమర్పిస్తూన్నట్లూ, స్వకీయాలైన ఉదకాలచే సముద్రుడికి తృప్తికారణమైన తర్పణం కావిస్తూన్నట్లూ ఉంది. అది ఎలా ఉందంటే నీ వొసగిన నీ స్వరూపాలైన వాక్కుల కూర్పులచే నిన్ను నేను స్తుతిస్తూన్నాను.